# తొలివార్త
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 148 శనివారం 03 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial



best deal
HEALTH & WEALTH
"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."
We create opportunities | 9640707117 (What's up only)


## ప్రజా పాలనకు
# గాంధీజీ ఆశయాలే కీలకం



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గాంధీ మహాత్ముడి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో ఆయన సమాధికి గవర్నర్, సీఎం నివాళులు అర్పించారు
- గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు
- గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి తిలకించారు
- అహింసనే ఆయుధంగా స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించారు
- మహాత్మా గాంధీ మానవాళికి సత్యం, శాంతి, మానవత్వం నేర్పిన మహనీయుడని సీఎం కొనియాడారు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 02 :** గాంధీ మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఆయన సమాధికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. వారితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా బాపూజీకి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం అహింసనే ఆయుధంగా మలచి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ మానవాళికి సత్యం, శాంతి, మానవత్వం నేర్పిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి తిలకించారు. అనంతరం డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్‌తో కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సత్యం, అహింస, స్వావలంభన, గ్రామ స్వరాజ్యం, సామాజిక - మిగతా 2 లో

## కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి
# చెమటలు పట్టిస్తాం



- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ పెడతామన్న తలసాని
- సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 02 :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి - మిగతా 2 లో



## ప్రభుత్వ పాఠశాలల్లో
# అల్పాహార పథకం

- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 02 :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ - మిగతా 2 లో

## మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ,
# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళి



- రాజ్‌ఘాట్‌లో బాపూజీకి అంజలి ఘటించిన ప్రధాని మోదీ
- నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా
- విజయ్‌ఘాట్‌లో శాస్త్రికి నివాళులర్పించిన ప్రధాని, ప్రముఖులు

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 02 :** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు గాంధీ, శాస్త్రికి నివాళులర్పించారు. ఉదయం రాజ్‌ఘాట్‌కు చేరుకున్న వారు గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం విజయ్‌ఘాట్‌ను సందర్శించి లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సర్వధర్మ ప్రార్థనలోనూ ప్రముఖులు పాల్గొన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా సందేశాన్ని - మిగతా 2 లో

# 44 ఏళ్ల తర్వాత ఆసియా గేమ్స్‌లో హాకీలో భారత్‌కు గోల్డ్ మెడల్

- ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం
- 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్
- ఆసియా క్రీడల హాకీ ఛాంపియన్లుగా భారత్ అమ్మాయిలు
- ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం
- 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 02 :** భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో - మిగతా 2 లో




## విదేశీ అప్పులపైనే
# పాక్ బతుకు

- ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!
- విదేశీ రుణాలు, డిపాజిట్లపైనే ఆధారపడుతున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ
- చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ కూడా ఎగుమతులను పెంచడంలో విఫలం
- అప్పులు, డిపాజిట్లు తాత్కాలిక ఉపశమనమేనని నిపుణుల హెచ్చరిక
- ఎగుమతులు పెరగకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం - మిగతా 2 లో

## రాయలసీమ రైతుల
# తల రాతలు మారబోతున్నాయి



- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు పునాదిరాయి

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 02 :** రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... - మిగతా 2 లో




## అంతరిక్ష రంగంలో
# భారత్ దూకుడు

- ప్రపంచ స్పేస్ పవర్‌గా ఎదుగుతున్న దేశం!
- ప్రపంచ స్పేస్ మిషన్ల గురించి 'ది గార్డియన్' ప్రత్యేక కథనం
- భారత్ ప్రపంచ స్పేస్ పవర్‌గా ఎదుగుతోందని విశ్లేషణ
- చంద్రయాన్-3తో కీలక విజయం సాధించిందని వ్యాఖ్య
- అంతరిక్ష సాంకేతికతతో పలు రంగాలకు ప్రయోజనమని వివరణ

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 02 :** అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా దూసుకెళు తోంది. 1975లో ఆర్యభట్ట ప్రయోగంతో మొదలైన ప్రయాణం.. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్ దిశగా సాగుతూ - మిగతా 2 లో

## సీఎం చంద్రబాబు గారూ..
# 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి



- రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌తో రైతులను సీఈఓలుగా మారుస్తామన్న అనంత్
- ఏపీలో రూ.1 లక్ష కోట్లతో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న రిలయన్స్
- అనంత్ ప్రసంగానికి మంత్రముగ్ధులైన నేతలు
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సీఎం చంద్రబాబు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 02 :** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాట చెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. - మిగతా 2 లో

# కరవుసీమ ఇకపై
# కనకసీమగా మారుతుంది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా..చేసి చూపిస్తున్నా
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి కృతజ్ఞతలు
- 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుంది
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 02 :** గాంధీ జయంతి సందర్భంగా కరవుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. అక్షరాలా రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ కరవు పరిస్థితులు, రైతుల కష్టాలను నిర్మలా సీతారామన్‌కు పలు సందర్భాల్లో వివరించానని రైతుల బాధలను నిర్మలా సీతారామన్ అర్థం చేసుకున్నారని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 'రాయలసీమ ఉద్యాన హబ్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అలానే అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని ఏ ప్రాజెక్టునైనా జయప్రదం చేసేవరకు వదిలిపెట్టని వ్యక్తి అనంత్ అంబానీ అని ప్రశంసించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పానని - మిగతా 2 లో

RNI : TGTEL/25/A0357

# సంపాదకీయం

## మళ్లీ ఉన్మాద ఛాయలు!




కొన్ని హఠాత్సంఘటనలు అరుదైన వ్యక్తులనూ, మనుషుల్లోని అసాధారణతనూ ప్రపంచం ముందు ఆవిష్కరిస్తాయి. బుధవారం ఒక దుండగుడి హైజాక్ యత్నంలో చిక్కుబడి, ప్రమాదపుటంచుల్లోపడిన ఫ్లై దుబాయ్ విమానం తిరిగి నిలదొక్కుకున్న ఉదంతంలో ఆ విమానం పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు ఇప్పుడు ప్రపంచం మూలమూలనా మార్మోగటానికి ఆయన ప్రదర్శించిన తెగువ, సాహసాలే కారణం. కో కెప్టెన్ దాడితో శరీరంనిండా కత్తిపోట్లున్నా, నెత్తురోడుతూ అపస్మారకంలోకి పోతున్నా కెప్టెన్ మచ్చర్ ఏమాత్రం జంకక సమయస్ఫూర్తితో, విమానాన్ని రక్షించి తీరాలన్న పట్టుదలతో కాక్‌పిట్ తలుపు లాక్ తెరవడం చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే సన్నివేశం. ఆయన స్ఫూర్తిదాయక వ్యవహారశైలి దేశదేశాల్లోని పైలెట్లకు, మొత్తం విమానయాన సిబ్బందికి భవిష్యత్తులో ఒక అధ్యయనాంశంగా మారుతుంది. సరిగ్గా పాతికేళ్లనాడు అమెరికాలో నాలుగు విమానాల్ని దారిమళ్లించి కూల్చివేసి, వేలాదిమంది మరణానికి కారణమైన ఉగ్రవాద ఉన్మాదంనుంచి ప్రపంచ దేశాలింకా సరైన గుణపాఠం నేర్చుకోలేదని ఈ హైజాక్ యత్నం రుజువుచేసింది. అది ఆత్మాహుతి దాడా... మరేదైనానా అన్నది తేల్చాల్సివున్నదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో సహా పలువురు చెబుతున్నా, దీనివెనక ఇరాన్ హస్తమున్నదని బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ ఆరోపిస్తున్నారు. ఈ దుండగానికి కారకుడైన కో పైలెట్ ఒమన్ జాతీయుడు. 174 మంది ప్రయాణిస్తున్న ఆ విమానం ఎన్నో అవాంతరాలెదురైనా చివరకు సురక్షితంగా సౌదీ అరేబియాలో అడుగుపెట్టింది. కెప్టెన్ మచ్చర్‌పై కో పైలెట్ దాడి,వారి పెనుగులాట... అనుకోకుండా కాక్‌పిట్ తలుపు లాక్ తెరుచుకోవడం వంటి వరస పరిణామాలు అందులో ప్రయాణిస్తున్న వారందరినీ దిగ్భ్రాంతిలో పడేశాయి.ఈమధ్యలోనే విమానం నియంత్రణ కోల్పోయి నిమిషంలోపే 34,000 అడుగుల ఎత్తునుంచి 17,000 అడుగులకు పడిపోవటంతో ప్రయాణికులంతా ప్రాణభయంతో కేకలు వేయటం వీడియోలో రికార్డయింది. మరో 2,000 అడుగుల కిందకు జారాక అది మళ్లీ క్రమేపీ గాల్లోకి లేవడం ఒకరకంగా అదృష్టమని చెప్పాలి. ప్రయాణికుల్లో కొందరు చొరవగా లోపలికెళ్లి జరిగిందేమిటో గ్రహించి కోపైలెట్‌ను అదుపు చేయటం, ప్రయాణికుల్లో ఒకరైన డెంటిస్టు రక్తస్రావం కాకుండా కెప్టెన్‌ను కాపాడటం ప్రశంసించ దగ్గ పనులు. ఇంకా ఆశ్చర్యకరమైన సంగతేమంటే... అనుకోకుండా ఆ విమానంలో రిలీఫ్ పైలెట్లు ఉండటం. అత్యవసర సమయంలో విమానం నడపాల్సిన కో పైలెటే నేరగాడు కావటం, పైలెట్‌కు స్పృహ లేకుండా పోవడం వంటి పరిణామాల మధ్య ఆ రిలీఫ్ పైలెట్లు లేకుంటే ఏం జరిగివుండేదో ఊహించుకుంటేనే వణుకొస్తుంది.అమెరికాలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పైలెట్ లేదా కో పైలెట్ కోరుకుంటే తప్ప కాక్‌పిట్ తలుపు తెరుచుకోకుండా విమానాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బయటినుంచి తెరిచే ప్రయత్నం దుర్లభమయ్యేంత పటిష్టంగా ఆ తలుపుంటుంది. హైజాక్ యత్నం, బెదిరింపులు వంటివి క్యాబిన్‌లో మాత్రమే జరుగుతాయనీ,కాక్‌పిట్ సురక్షితంగా ఉండేలా చూస్తే సరిపోతుందనీ ఈ సాంకేతికత తీసుకొచ్చారు. కానీ తాజా ఉదంతంలో ప్రమాదం క్యాబిన్‌లో కాకుండా, కాక్‌పిట్‌లోనే పొంచివుండటం గమనించదగ్గది. వీటి సంగతలావుంచి అసలు దుబాయ్‌లో కో పైలెట్ చాకుతో విధులకు ఎలా రాగలిగాడు? అంటే భద్రత విషయంలో మునుపటి అప్రమత్తత సన్నగిల్లిందన్నమాట! నిత్యం వేలాదిమంది ప్రయాణించే దుబాయ్ విమానాశ్రయంలో ఇలాంటి భద్రతాపరమైన లోపం చోటుచేసుకోవటం ఊహకందనిది. ప్రపంచం కక్షలు, కార్పణ్యాలతో భయానకంగా మారింది. ఇప్పుడు జరిగిన ఉదంతానికి పురిగొల్పిన పరిణామాలేమిటన్నది ఇంకా తెలియాల్సే వున్నా ఇజ్రాయెల్ గాజాలో సాగిస్తున్న మారణకాండకు ప్రతీకారంగా కో పైలెట్ ఆ దేశ పౌరులు అధికంగా వున్న విమానాన్ని కూల్చేయదల్చుకున్నాడన్న కథనాలు వెలువడుతున్నాయి. 'కంటికి కన్ను...' సిద్ధాంతం మనిషిని ఉన్మాదిగా మారుస్తుంది. సహేతుక పోరాటాలపై నీలినీడలు కమ్మేలా చేస్తుంది. ఒక ఉన్మాదానికి మరో ఉన్మాదం ఎప్పటికీ జవాబు కాదు.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

**మొదటిపేజీ తరువాయి -** రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 44 ఏళ్ల తర్వాత ఆసియా గేమ్స్‌లో హాకీలో భారత్‌కు గోల్డ్ మెడల్

**మొదటిపేజీ తరువాయి -** సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

## కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం




**మొదటిపేజీ తరువాయి -** రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు.ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది



**మొదటిపేజీ తరువాయి -** అలానే చేసి చూపిస్తున్నానని సీఎం అన్నారు. తాను, పవన్, మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. మోదీ నమ్మకాన్ని నిజం చేస్తూ నిర్మలాసీతారామన్ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కుకు నిధులిచ్చి ఆదుకున్నారని తెలిపారు. సీమ దశ, దిశ మార్చి గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు తీసుకొచ్చామని, కరవు నేలను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. పండ్ల తోటల సాగులో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని సాగునీరు ఇస్తే సీమ ప్రజలు బంగారం పండిస్తారని సీఎం కొనియాడారు."ఎన్టీఆర్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకెళ్తున్నాం. హంద్రీనీవా ద్వారా నీళ్లు లేకపోతే మదనపల్లె మొత్తం వలసపోయేది. సీమ పరిస్థితులు మార్చేందుకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. పంటకుంటలు, వాటర్‌షెడ్ పథకాలు ఏర్పాటు చేసి జలసంరక్షణకు ప్రాధాన్యమిచ్చాం. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తిచేసి మూడేళ్లలో జాతికి అంకితం చేసే బాధ్యత మాది. సీమలో హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచి కెనాల్ విస్తరణ పూర్తికి చర్యలు తీసుకుంటాం. రాయలసీమను కరవు సీమ కాదని మరోసారి నిరూపిస్తా. 20 రకాల పంటల్లో ఏ పంట అయినా పండించే సత్తా సీమ రైతులదని ఉత్పత్తికి మార్కెట్ సౌకర్యమిస్తే సంపద సృష్టిస్తారని సీఎం చెప్పారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో పంటలు, ధరలు, వాతావరణ స్థిరీకరణ జరుగుతుంది వెల్లడించారు. అనంత్ అంబానీ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో జంతువుల పునరావాస కేంద్రాన్ని అనంత్ అంబానీ ఏర్పాటు చేశారని అలానే తిరుమల శ్రీవారిపై భక్తితో అనంత్ అంబానీ ఉచితంగా ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చారని వెల్లడించారు. పోలవరం పనులు ముమ్మరంగా సాగుతున్నాయమని ప్రాజెక్టును పూర్తిచేసి మోదీ చేతులమీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే ఆంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ.. ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు.టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

## మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళి

**మొదటిపేజీ తరువాయి -** పంచుకున్నారు. మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధాలు, సంఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో గాంధీ శాంతి, అహింస సందేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. దేశ ప్రజల తరఫున గాంధీకి గౌరవపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. సహానుభూతి, సమ్మిళిత విధానాలకు ప్రాధాన్యతనిస్తూ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్యం అందరి సంక్షేమాన్ని కోరుకునే గాంధీ 'సర్వోదయ' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. నైతిక ప్రవర్తన, క్రియాశీల భాగస్వామ్యంతో శక్తివంతమైన, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి నిబద్ధతను పునరుద్ఘాటించాలని పిలుపునిచ్చారు.ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కూడా గాంధీకి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జీవితం, సందేశం శాంతి, కరుణ, నిస్వార్థం, సేవాభావాలకు శాశ్వత దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. గాంధీ ఆశించిన విలువలకు కట్టుబడి, న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన, సమ్మిళిత సమాజ నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ గాంధీకి నివాళులర్పిస్తూ 'ఎక్స్'లో సందేశం పంచుకున్నారు. బాపూజీ జీవితం మొత్తం సత్యం, అహింస, కరుణ, సేవలకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. ఆయన సందేశాలు ప్రతి యుగంలో మానవాళికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. గాంధీ కాలాతీత సందేశం మనల్ని ఉత్తమ సమాజం, సమైక్య భారత్ వైపు నడిపిస్తూనే ఉండాలని అన్నారు.గాంధీ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రేరేపించాయని ప్రధాని పేర్కొన్నారు. మానవాళితో పాటు గాంధీ ఆలోచనల ప్రవాహం కొనసాగుతున్నంత కాలం అవి ఎప్పటికీ ప్రాసంగికంగానే ఉంటాయని అన్నారు. గాంధీజీ స్వదేశీ, ఖాదీకి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేస్తూ అక్టోబర్ 2న కనీసం ఒక ఖాదీ ఉత్పత్తిని కొనుగోలు చేసి 'ఇది స్వదేశీ' అని గర్వంగా చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. శాస్త్రి నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మరో వీడియో సందేశంలో శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని గుర్తుచేశారు. దేశ సైనికులు, రైతులకు ఆయన అందించిన స్ఫూర్తిని ప్రస్తావించారు. వినయపూర్వకమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ శాస్త్రి దృఢమైన నాయకుడని ప్రధాని పేర్కొన్నారు. దేశం పట్ల ఆయనకున్న నిస్వార్థ భక్తి, ప్రధానమంత్రిగా తన స్వల్ప పదవీకాలంలో దేశానికి సేవలందించేందుకు దోహదపడిందన్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ విజయ్‌ఘాట్‌కు వెళ్లి శాస్త్రికి నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా గాంధీజీకి నివాళులర్పించారు. సత్యం, అహింస, సామరస్యం, న్యాయం అనే గాంధీజీ సూత్రాలపై నిలబడటమే ఆయనకు నిజమైన నివాళి అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ప్రజా పాలనకు గాంధీజీ ఆశయాలే కీలకం

**మొదటిపేజీ తరువాయి -** సమానత్వం గాంధీ ఆశయాలకు పునాదులని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా పాలనకు ఆయన ఆశయాలే కీలకమని వివరించారు. గాంధీ.జీ చూపిన సత్యం, అహింస మార్గంలో శాంతి, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని సీఎం ట్వీట్ చేశారు.గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థ నేతృత్వంలో ఎల్బీ స్టేడియంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 1157 చరకాలను గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థ ప్రదర్శించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ హాజరయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు.సత్యాగ్రహ ఉద్యమం ద్వారా గాంధీ స్వాతంత్ర్యం సాధించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు లేని సమాజం నిర్మించాలని గాంధీ చెప్పారన్న ఆయన, 1924లో అస్పృశ్యతపై గాంధీ నిర్ణయం స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని మార్చినట్లు తెలిపారు. హరిజన ఉద్ధరణ పేరుతో సమాజానికి దూరంగా ఉన్న జాతులను ఏకం చేశారని చెప్పారు. హిందూ-ముస్లిం భాయీభాయీ అని ఉద్యమంలోకి తీసుకువచ్చారని, జాతీయ ఉద్యమంతో బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. బాపూజీ ఉద్యమం గురించి తెలియని వారు దేశ చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గాంధీజీని తక్కువ చేసి చూడాలనే ఆలోచనను బీజేపీ నేతలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు గాంధీ భవన్‌లోనూ మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు కాంగ్రెస్? నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

**మొదటిపేజీ తరువాయి -** 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష రంగంలో భారత్ దూకుడు

**మొదటిపేజీ తరువాయి -** ఇప్పుడు భారతీయ అంతరిక్ష కేంద్రం వరకు చేరింది. ఈ క్రమంలో భారత్ ప్రపంచంలో కీలక అంతరిక్ష శక్తిగా ఎదుగుతోందని టాంజానియాకు చెందిన 'ది గార్డియన్' పత్రిక ఓ కథనంలో పేర్కొంది.2023లో చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ కావడం భారత అంతరిక్ష సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది. ఆ తర్వాత ఆదిత్య-ఎల్1 ద్వారా సూర్యుడిపై పరిశోధనలు ప్రారంభించింది. స్పాడెక్స్ ప్రయోగంతో అంతరిక్షంలో రెండు వాహనాలను అనుసంధానం చేసే డాకింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది.2024లో ఆమోదం పొందిన చంద్రయాన్-4 మరింత క్లిష్టమైన మిషన్. చంద్రుడిపై దిగడం, అక్కడి నుంచి మట్టి నమూనాలను సేకరించడం, వాటిని తిరిగి భూమికి తీసుకురావడం దీని లక్ష్యం. ఇందుకోసం ఒకటి కంటే ఎక్కువ ప్రయోగాలు, డాకింగ్, చంద్రుడి ఉపరితలం నుంచి తిరిగి పైకి రావడం వంటి సంక్లిష్ట దశలు ఉంటాయి.భారత్ గ్రహాంతర పరిశోధనలను కూడా విస్తరిస్తోంది. శుక్రయాన్ మిషన్‌ను 2028 మార్చిలో ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రుడి వాతావరణం, ఉపరితలం, భూగర్భ పరిస్థితులను ఈ మిషన్ అధ్యయనం చేయనుంది. మరోవైపు భూమికి సుమారు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిత్య-ఎల్1 సూర్యుడి కార్యకలాపాలు, అంతరిక్ష వాతావరణాన్ని పరిశీలిస్తోంది.భారత్ అంతరిక్ష ప్రయాణంలో గగన్‌యాన్ కీలక ప్రాజెక్టుగా మారింది. మనుషులను అంతరిక్షంలోకి పంపేందుకు అవసరమైన జీవనాధార వ్యవస్థలు, అత్యవసర రక్షణ వ్యవస్థలు, పారాచూట్లు, తిరిగి భూమికి వచ్చే సాంకేతికతను భారత్ పరీక్షిస్తోంది. ముందుగా మానవరహిత ప్రయోగాల ద్వారా కీలక వ్యవస్థలను పరీక్షించి, ఆ తర్వాత వ్యోమగాములను పంపేలా దశలవారీగా ముందుకెళుతోంది.భూమిపైనా అంతరిక్ష సాంకేతికత ప్రభావం భారత అంతరిక్ష కార్యక్రమం ప్రయోజనాలు అంతరిక్షానికే పరిమితం కావడం లేదు. వాతావరణ అంచనాలు, వ్యవసాయం, నావిగేషన్, సమాచార వ్యవస్థలు, విపత్తుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణలో ఉపగ్రహాలు కీలకంగా మారాయి. వరదలు, తుపానులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను ముందుగానే గుర్తించడంలో ఉపగ్రహ చిత్రాలు ఉపయోగపడుతున్నాయి.అడవులు, నీటి వనరులు, నగరాల విస్తరణ, కాలుష్యం, వాతావరణ మార్పులను పర్యవేక్షించడంలోనూ అంతరిక్ష డేటా ఉపయోగపడుతోంది. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు, విద్యను అందించడంలోనూ ఈ సాంకేతికత ఉపయోగపడుతోంది.అంతరిక్ష రంగంలో అభివృద్ధి చేస్తున్న ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, కమ్యూనికేషన్, నావిగేషన్, తయారీ సాంకేతికతలు ఇతర రంగాలకూ విస్తరిస్తున్నాయి. రైల్వే ఇంజిన్ల కోసం ఇస్రో సెమీ కండక్టర్ ల్యాబొరేటరీ అభివృద్ధి చేసిన 900కుపైగా అప్లికేషన్-స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయి. అంతరిక్ష రంగంలో పెట్టుబడులు కొత్త సాంకేతికతలు, పరిశ్రమలు, నైపుణ్యాలు, వాణిజ్య అవకాశాలకు దారితీస్తున్నాయని కథనం పేర్కొంది.

# విదేశీ అప్పులపైనే పాక్ బతుకు




**మొదటిపేజీ తరువాయి -** పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అందే రుణాలు, సౌదీ అరేబియా, చైనా వంటి మిత్ర దేశాలు ఇచ్చే డిపాజిట్లపైనే దేశం పూర్తిగా ఆధారపడి ఉంది. ఈ నిధులు ఎప్పటికప్పుడు తలెత్తుతున్న చెల్లింపుల సంక్షోభం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) నుంచి తాత్కాలికంగా గట్టెక్కిస్తున్నప్పటికీ, దేశానికి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఓ నివేదిక స్పష్టం చేసింది.'డాన్' పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. పాకిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తమ భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను అడ్డుపెట్టుకుని విదేశీ మద్దతు పొందడంపైనే దృష్టి సారించింది తప్ప, ఎగుమతి ఆధారిత సుస్థిర వృద్ధి నమూనాను నిర్మించలేకపోయింది. దీని ఫలితంగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగినప్పుడల్లా అది దిగుమతులు, వినియోగం ఆధారంగానే జరిగింది. దీంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు తరచూ అడుగంటిపోవడం, సంక్షోభం తలెత్తడం ఒక చక్రంలా కొనసాగుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అప్పటి సైనిక పాలకుడి హయాంలో పాకిస్థాన్‌కు భారీగా విదేశీ నిధులు, రుణమాఫీ, పెట్టుబడులు వెల్లువెత్తాయి.అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఆ నిధులన్నీ దిగుమతులు, వినియోగం, రియల్ ఎస్టేట్ రంగాలకు మళ్లడంతో 2008 నాటికి దేశం రికార్డు స్థాయిలో కరెంట్ ఖాతా లోటును ఎదుర్కొని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది.ముఖ్యంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) దేశంలో విద్యుత్ కొరతను తీర్చడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి దోహదపడింది. కానీ, విదేశీ రుణాలు తగ్గించుకోవడానికి అవసరమైన ఎగుమతుల వృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. పైగా సీపీఈసీ ప్రాజెక్టుల కారణంగా దిగుమతులు మరింత పెరిగి 2018 నాటికి కరెంట్ ఖాతా లోటు మళ్లీ ఆందోళనకర స్థాయికి చేరింది.కరోనా మహమ్మారి తర్వాత తీసుకున్న ఉద్దీపన చర్యలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కమోడిటీ ధరలు, రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు పూర్తిగా ఐఎంఎఫ్ కార్యక్రమాలు, మిత్ర దేశాల డిపాజిట్లపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే, ఈ నిధులు దేశంలో ఆర్థిక కార్యకలాపాలను నేరుగా సృష్టించవని, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని తీసుకురావని నివేదిక హెచ్చరించింది. మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ నిధుల లభ్యత కూడా ఎప్పుడూ ప్రమాదంలోనే ఉంటుంది. గతంలో అభివృద్ధి ఆధారిత సహాయం, పెట్టుబడులు పొందిన పాకిస్థాన్, ఇప్పుడు అధిక వడ్డీ రుణాలు, స్వల్పకాలిక డిపాజిట్లపై ఆధారపడే స్థితికి దిగజారిందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ఎగుమతుల వృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలు దీర్ఘకాలిక స్తబ్దతగా మారే ప్రమాదం ఉంది. ఫలితంగా, పాకిస్థాన్ తక్కువ వృద్ధి రేటు, మరో విదేశీ మారక నిల్వల సంక్షోభం మధ్య చిక్కుకుపోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఓరుగంటి వీరయ్య భవన్ లో
# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు..

**చిత్రపటానికి ఘన నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**



భద్రాద్రి జిల్లా అ **అక్టోబర్ 02 ( తొలివార్త ):** మహాత్మా గాంధీ157వ జయంతి సందర్భంగా అశ్వాపురం మండల కేంద్రంలోని ఓరుగంటి వీరయ్య భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, ఆయన సత్యం, అహింసా సిద్ధాంతాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్అధినేత,వేములపల్లి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కాకా రాములు, మట్టా వీరభద్రారెడ్డి, బచ్చు వెంకటరమణ, కొర్లకుంట రాంబాబు, వేముల విజయ్, ఎస్.కె. గాలిబ్, తెల్లం వీరభద్రం, గడల చలపతిరావు, భట్టి వెంకన్న, దారా రాము తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం
# ఎదుట జర్నలిస్టుల సమస్యలపై నిరసన దీక్ష

**మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీలు నాయకులు ప్రముఖులు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 02 ( తొలివార్త ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం,ఎదుట,శుక్రవారం నాడు జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్షకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, మరియు జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) తరుపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి గా, జర్నలిస్టులు, పనిచేస్తున్నారని వారి ప్రాణాలు పనంగాపెట్టి, ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజా సమస్యలను, నిత్యం, ప్రభుత్వం, దృష్టికి,తీసుకెళ్తున్నారని,అని,అన్నారు,జర్నలిస్టులకు కనీసం జీతభత్యాలు కూడా,రావని,ప్రభుత్వమే,జర్నలిస్టులను వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ జర్నలిస్టులు మండలంలోని జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై
# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి వినతి పత్రం అందజేసిన

**టి యు డబ్ల్యూ జే- ఐ జే యు నాయకులు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 02 ( తొలివార్త ):** కేంద్ర కమిటీ పిలుపు, లో,భాగంగా టి యు డబ్ల్యూ జే,- ఐ జే యు, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం మణుగూరు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ని, టీయూడబ్ల్యూజే- ఐజేయు, నియోజకవర్గం అధ్యక్షుడు, పి. వెంకట్,ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలపై, వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు ప్రభుత్వం, ద్వారా, పరిష్కరించాలని జర్నలిస్టులను అన్ని విధాలుగా, ఆదుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి, టి యు డబ్ల్యూ- ఐ జే యు యూనియన్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మరియు నియోజకవర్గ టియూడబ్ల్యూజే- ఐజేయు నాయకులు, మరియు మండలాలకు చెందిన జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి వేడుకలలో
# పాల్గొని ఘనంగా నివాళులు అర్పించిన

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 02 ( తొలివార్త ):** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మరియు పాత మార్కెట్ సెంటర్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి 157వ జయంతి సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు,భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ఉపసర్పంచ్ రత్నం కవిత వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గంలో చేసిన పోరాటం, దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. “బలహీనతను బలంతో జయించడం కాదు.. అహింసతో, సత్యంతో అన్యాయాన్ని ఎదుర్కోవడమే మహాత్మా గాంధీ చూపిన మార్గం.”గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

# జింకల గూడెం లో కార్డెన్ అండ్ సెర్చ్...

**భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు...**

**పాల్వంచ డిఎస్పి సతీష్, ఆధ్వర్యంలో**



భద్రాద్రి జిల్లా బూర్గంపాడు **అక్టోబర్ 02 ( తొలివార్త ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రమైన జింకల గూడెం గ్రామం లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి ప్రతి ఇల్లుని తనిఖీ చేసి గ్రామంలో ఎవరైనా అనుమానితులు ఉన్నారా అని, గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు గురించి తనిఖీ చేయడం జరిగింది, ఇందులో సరైన పత్రాలు లేని కారణంగా 40 వాహనాలను సీజ్ చేయడం జరిగింది. పాల్వంచ డిఎస్పి సతీష్, మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గంజాయి సేవించే వాళ్ళు ఉన్నా లేదా అక్రమ రవాణా చేసిన, అదేవిధంగా పశువుల అక్రమ చేసిన వారు వివరాలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. చేతబడి బాణామతి లాంటి మూఢనమ్మకాలు నమ్మవద్దని ఆ మూఢనమ్మకాలతో ఎవరిని హింసించవద్దని తెలిపారు. వాహనదారులందరూ సరైన పత్రాలు కలిగి ఉండాలని వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, బూర్గంపాడు మండల సబ్ ఇన్స్పెక్టర్లు మేడ ప్రసాద్, నాగ భిక్షం, రామ్మూర్తి, పాల్వంచ టౌన్ ఎస్ఐ లు నాగరాజు, విజయ, పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్, ములకలపల్లి ఎస్ఐ మధు ప్రసాద్, మరియు డాగ్స్ స్క్వాడ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలన్నీ నేడు శాంతి, అహింసను కోరుకుంటున్నాయి

**గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను నేటి తరం ఆచరించాలి**

**డాక్టర్ రియాజ్**





**హైదరాబాద్ అక్టోబర్ 02 ( తొలివార్త ):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, కుసుమధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో జయంతి సభ ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సాహితీ కుటీరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జీవితానికి సంబంధించిన అనేక విషయాలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, నైతిక విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ స్వదేశీ వస్తువుల వినియోగం, ఖాదీ వస్త్రాల ధారణకు ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచ దేశాలన్నీ శాంతిని కోరుకుంటున్నాయని, అహింసా మార్గం ద్వారానే శాంతి, సామరస్యాన్ని సాధించగలమని అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ నాయకత్వాన్ని, ఆయన ఇచ్చిన “చేయి లేదా చావు” పిలుపును గుర్తు చేశారు. గాంధీజీ తన జీవితాంతం సత్యం, అహింసా సిద్ధాంతాలను పాటించారని డాక్టర్ రియాజ్ అన్నారు. అంటరానితనం నిర్మూలన, హిందూ--ముస్లిం ఐక్యత, కులమత భేదాలు లేకుండా సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కె.సి. రాజు రాంప్రసాద్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఎంత ముఖ్యమో, లాల్ బహదూర్ శాస్త్రి కూడా అంతే ముఖ్యమైన నాయకుడని అన్నారు. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూతో శాస్త్రికి ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ, నెహ్రూ అనంతరం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నైతిక విలువలకు కట్టుబడి పనిచేసిన నాయకుడిగా శాస్త్రి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. మరో విశిష్ట అతిథి, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జీవితాలు, వారి నైతిక విలువలు, సిద్ధాంతాలను ప్రజలందరూ ఆదర్శంగా తీసుకుని ఆచరిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి బడే సాబ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ కవి గంట మనోహర్ రెడ్డి, పాలడుగు సరోజినీ దేవి, డాక్టర్ రాధా కుసుమ, గజవెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జీవితాలు, వారి ఆశయాలు, దేశానికి చేసిన సేవలను స్మరిస్తూ 50 మందికి పైగా కవులు, రచయితలతో ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు తమ కవితల ద్వారా గాంధీ, శాస్త్రి ఆశయాలను స్మరించుకున్నారు.

# గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు

**ప్రేమ, సత్యం, అహింసా మార్గాలే మనకు ఆదర్శం**

**గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షులు మాటూరి అశోక్**



**భువనగిరి, అక్టోబర్ 02 ( తొలివార్త ):** మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో శుక్రవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మాటూరి అశోక్, సంస్థ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, ప్రేమ, శాంతి మార్గాలు సమాజానికి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాటూరి అశోక్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ సత్యం, అహింసా మార్గాలను ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. గాంధీజీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య ఉద్యమం దేశ ప్రజల్లో ఐక్యత, స్వేచ్ఛా భావాలను బలపరిచిందని తెలిపారు. నేడు దేశ ప్రజలు సుఖశాంతులతో జీవించేందుకు స్వాతంత్ర్యం సాధించిన ఉద్యమం ప్రధాన కారణమని అన్నారు. గాంధీజీ ఆచరించిన ప్రేమ, సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రస్తుత సమాజంలో మరింత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్ర, ఆయన సిద్ధాంతాలు, దేశం కోసం చేసిన త్యాగాలను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు పరిచయం చేసి, వాటిని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం పెంపొందించేందుకు గాంధీజీ బోధించిన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ సత్యం, అహింసను పాటించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు కొత్త బాలరాజు, బానోతు బాలన్, రామాచారి, ధర్పల్లి ప్రవీణ్ కుమార్, గుమ్ముల మల్లేశం తదితరులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో శాంతి, అహింస, మానవతా విలువల పరిరక్షణకు కృషి చేస్తామని వారు తెలిపారు

# అర్ధరాత్రి స్పందించి మూడు ప్రాణాలకు పునర్జన్మనిచ్చిన ప్రభుత్వ వైద్యులు

**అభినందనలు తెలిపిన సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నే రవి**



మణుగూరు, **అక్టోబర్ 02 ( తొలివార్త ):** అర్ధరాత్రి వేళలో నిండు గర్భిణి స్త్రీకి ఎదురైన అత్యవసర ప్రసవ పరిస్థితిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, 108 సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి తల్లి, ఇద్దరి శిశువుల ప్రాణాలను కాపాడేందుకు ,చేసిన,కృషి, అభినందనీయమని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి పేర్కొన్నారు.మణుగూరు మండలంలోని పగడేరు గ్రామపంచాయతీ పరిధిలోని విప్పలగుంపు గ్రామానికి చెందిన బాడిషా భీమా,అనే మహిళ గర్భిణిగా మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో మొదటి శిశువు సాధారణ ప్రసవం ద్వారా జన్మించినట్లు, వైద్యులు తెలిపారు.అయితే రెండో శిశువు ప్రసవం విషయంలో పరిస్థితి క్లిష్టంగా మారడంతో, మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు అప్రమత్తమయ్యారు.సమయం వృథా చేయకుండా మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాల్సిన అవసరాన్ని గుర్తించారు.రాత్రి సుమారు 12:30 గంటల సమయంలో మణుగూరు 100 పడకల ఆసుపత్రి నుంచి 108 అత్యవసర వాహనం ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి భీమ అనే మహిళ గర్భిణిని తరలించారు.అర్ధరాత్రి సమయంలో అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 108 సిబ్బంది వేగంగా స్పందించడంతో పాటు, భద్రాచలం వైద్య బృందం కూడా, ముందస్తు, సమన్వయంతో చికిత్సకు సిద్ధమైనట్లు కర్నే రవి తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు మల్లేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరిస్థితిని పరిశీలించి అత్యవసరంగా సిజేరియన్ నిర్వహించినట్లు తెలిపారు. తద్వారా తల్లి, రెండో శిశువుకు అవసరమైన వైద్య చికిత్స అందించగలిగారని పేర్కొన్నారు.ఒకవైపు మొదటి శిశువు జననం, మరోవైపు రెండో శిశువు కోసం అత్యవసర వైద్య చర్యలు అవసరమైన సమయంలో వైద్యుల మధ్య జరిగిన సమన్వయం కీలకంగా మారిందని ఆయన అన్నారు.మణుగూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముడిగొండ రామకృష్ణ, స్రవంతి సిస్టర్‌తో పాటు మణుగూరు, భద్రాచలం వైద్య సిబ్బంది తీసుకున్న సకాల నిర్ణయాలు అభినందనీయమని కర్నే రవి పేర్కొన్నారు.అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ పైలట్, చొరవతో మరియు సిబ్బంది అందించిన సేవలు కూడా,ప్రత్యేకంగా,ప్రశంసించదగ్గవని అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులకు అత్యవసర సమయంలో 108 సేవలు ఎంతో,కీలకంగా, నిలుస్తున్నాయని తెలిపారు.ఒక్క క్షణం ఆలస్యం జరిగినా పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉన్న సమయంలో వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, 108 అంబులెన్స్, పైలట్,చొరవతో, సమన్వయంతో, స్పందించడం, అభినందనీయం” అని కర్నే, రవి అన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు చిత్రపటానికి ఘన నివాళులర్పించిన

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



మణుగూరు **అక్టోబర్ 02 ( తొలివార్త ):** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించి ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.గాంధీ జయంతి సందర్భంగా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు.గాంధీజీ అనుసరించిన అహింసా మార్గం, సత్యాగ్రహ సిద్ధాంతాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, సామాజిక సమానత్వం, గ్రామ స్వరాజ్యం, స్వదేశీ వస్తువుల వినియోగం, పేదల అభ్యున్నతి వంటి అంశాలకు గాంధీజీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.ప్రస్తుత సమాజంలో శాంతి, సహనం, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని అన్నారు. విభేదాలను హింసకు తావులేకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత గాంధీజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సత్యం, అహింస, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఎదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడమే మహాత్మా గాంధీకి అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## గ్రామసభలో కొత్త అభివృద్ధి పనుల గుర్తింపు పాల్గొన్న
# సర్పంచ్ దేశ బోయిన బాలస్వామి యాదవ్





**వలిగొండ, అక్టోబర్ 02 ( తొలివార్త ):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామంలో విబిజి రాంజీ గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రామసభ నిర్వహించి పలు కొత్త పనులను గుర్తించారు. గ్రామంలో భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, వ్యవసాయానికి నీటి లభ్యత పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టాల్సిన పనులపై గ్రామసభలో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నీటి కుంటలు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు పునఃభరణ బోర్లు, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వర్షపు నీటిని వృథాగా పోకుండా నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని, తద్వారా వ్యవసాయానికి నీటి కొరతను కొంతమేర అధిగమించవచ్చని అధికారులు, సిబ్బంది గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామంలో పునఃభరణ బోర్లు, ఇంకుడు గుంతలు అవసరమైన రైతులు, గ్రామస్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. అవసరాన్ని బట్టి పనులను గుర్తించి సంబంధిత అభివృద్ధి కార్యక్రమాల్లో చేర్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గ్రామస్థుల భాగస్వామ్యంతో గుర్తించడం ద్వారా వాటికి ప్రాధాన్యత క్రమంలో చర్యలు తీసుకోవాలని గ్రామసభలో నిర్ణయించారు. వర్షపు నీటి సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశబోయిన బాలస్వామి, వార్డు సభ్యులు గణేష్, మల్లమ్మ, సజీనా బేగం, కృష్ణమూర్తి, మధుకుమార్, శ్రీనివాస్, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె. నాగరాజు, కారోబార్ లింగస్వామి, క్షేత్ర సహాయకురాలు సునీతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో
# ఘనంగా గాంధీజీ 157వ జయంతి వేడుకలు



**వలిగొండ, అక్టోబర్ 02 ( తొలివార్త ):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మలుగ మాధవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. గాంధీజీ ద్ధాంతాలను, దేశభక్తి భావాన్ని యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ఆయన చూపిన అహింస, సత్యం, సామాజిక సేవా మార్గాలను అనుసరించడం ద్వారా భావితరాలకు మంచి మార్గదర్శకత్వం అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, జిల్లా గౌరవ సలహాదారు బోడిగే సుదర్శన్, ఉద్యమకారుల ఫోరం నాయకులు బత్తిని రవీందర్ గౌడ్, చిలుగూరి సత్తిరెడ్డి, ఐటి పాముల పుష్ప, దండ మల్లికార్జున్, సుంకి వెంకటేశ్వర్లు, ధనంజయ, మారగోని నరసింహ, కూర వెంకటేష్, కన్నెకంటి రామాచారి, అప్పిశెట్టి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
శనివారం 03 - 10 - 2026

## రూ.40 లక్షల వ్యయంతో నిర్మాణం.. ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





**వలిగొండ, అక్టోబర్ 02 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ వ్యవసాయ మార్కెట్‌లో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయాలను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వాణిజ్య సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన వాణిజ్య సముదాయాల ద్వారా వ్యాపారులకు మరింత సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మార్కెట్ అభివృద్ధితో రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. వలిగొండ వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, మార్కెట్‌కు వచ్చే రైతులకు తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితర మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్లను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులు, వ్యాపారులకు అందుబాటులో ఉండే విధంగా మార్కెట్ ప్రాంగణంలో వసతులను మరింత మెరుగుపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య భీమా నాయక్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గరిసె రవి, స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, వలిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, ఉప సర్పంచ్ మలుగ మాధవి, మార్కెట్ కమిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి హామీలపై సమాధానం లేదు

**కేటీఆర్ ప్రశ్నలకు జవాబు లేదు.**

**వ్యక్తిగత విమర్శలు మాని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి.**

**బిఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు.**



**వైరా అక్టోబర్ 02 ( తొలివార్త ):** సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు లతావత్ గిరిబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం భవిష్యత్ కార్యాచరణ పై సమాధానం చెప్పాల్సిన సమయంలో ముఖ్యమంత్రి వ్యక్తిగత రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వటం సరికాదని అన్నారు. ఎన్నికలు పూర్తయి దాదాపు మూడేళ్లు గడుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేశారు? రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యచరణ ఏమిటి? అనే ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని గిరిబాబు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమం నిర్వహించినప్పటికీ సీఎం ప్రసంగంలో అభివృద్ధి సమాధానాలు కంటే రాజకీయ విమర్శలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారికంగా వివరాలు వెల్లడైనప్పటికీ ప్రజలు అడుగుతున్న హామీల అమలుపై కూడా స్పష్టమైన లెక్కలు చెప్పాలని గిరిబాబు అన్నారు. కేటీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఫిరంగుల పేలుదాం గాడీలు కు ల్చుదాం వంటి రాజకీయ వ్యాఖ్యలు చేయటం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కావాలి ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల సభలో సీఎం టిఆర్ఎస్ కేటీఆర్ పై రాజకీయంగా తీవ్ర విమర్శలు చేసినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో ఉద్యోగాలు రైతులు నేతన్నలు సంక్షేమ పథకాలు అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలు సమాధానాలు కోరుతున్నారని వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని గిరిబాబు హితువు పలికారు. ఒక వ్యక్తిని ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయ విమర్శలు చేయడం ద్వారా ప్రభుత్వ బాధ్యత నుంచి తప్పించుకోలేదని ఆయన అన్నారు. వ్యక్తిగత కక్షలు రాజకీయ కక్ష సాధింపు ధోరణి పక్కనపెట్టి తెలంగాణ ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి ప్రజలకు ఇచ్చిన హామీల అమలపై స్పష్టత ఇవ్వండి తెలంగాణ అభివృద్ధిపై మీ కార్యచరణను ప్రజల ముందు పెట్టండి అని లకావత్ గిరిబాబు ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు హామీల అమలుపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకే పరిమితమైతే ప్రజలు తగిన సమయంలో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తారని ఆయన అన్నారు.

# జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

**పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎంబీ నర్సింహులు**





**భువనగిరి, అక్టోబర్ 02 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి కేంద్రంలో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎంబీ నర్సింహులు డిమాండ్ చేశారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం భువనగిరిలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యూనియన్ నాయకులు, సభ్యులు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిలకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎంబీ నర్సింహులు మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి భద్రతకు ప్రత్యేక జర్నలిస్టుల భద్రత చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల వేతన, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి నూతన వేజ్ బోర్డును ఏర్పాటు చేసి సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, వర్కింగ్ జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా గతంలో జర్నలిస్టులకు అందుబాటులో ఉన్న రాయితీ రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నందున వారి సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకా రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తి, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెలిమినేటి జహంగీర్, కే. మల్లేష్ చారి, పట్టణ అధ్యక్షుడు పి. లక్ష్మీనారాయణ చారి, ఎం. చెన్నయ్య, మల్లేశం, పాశం నవీన్, జి. హరిబాబు, ఎం. అనిల్ కుమార్, ఆరే కుమార్, నల్ల వేణు, ఉదయ్ రెడ్డి, కిషన్, మహేష్, బుగ్గ శ్రీనివాస్, జాకీర్, బండారు జగదీష్, సత్యం, శివ, సురేష్, కె. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

### గాంధీజీ,శాస్త్రీజీల జయంతి సందర్భంగా

## పలు చోట్ల ఘన నివాళులర్పించిన

**డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 02 ( తొలివార్త ):** భారతదేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీలు చేపట్టిన అహింసా మార్గమే యావత్ భారతావనికి ఆదర్శం, మార్గదర్శకం అని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన జాతిపిత మహాత్మాగాంధీ, భారతదేశ మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి సందర్భంగా పాల్వంచ శాస్త్రిరోడ్డులోని గాంధీజీ, శాస్త్రీజీ ల విగ్రహాలకు శుక్రవారం వాసవిక్లబ్, వర్తక సంఘం నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పాల్వంచ కార్పొరేషన్ 5 డివిజన్ హమాలీ కాలనీలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి,ఘనంగా,నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహాత్మాగాంధీ, ఆశయాలు మనందరికీ,స్ఫూర్తిదాయకమన్నారు. రైతు సంక్షేమం కోసం, దేశ భద్రత కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి శాస్త్రీజీ అని, కొత్వాల కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ లలితకుమారి, కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, జాలె జానకి రెడ్డి, కొండం వెంకన్న గౌడ్, ఎస్ఎ జలీల్, చీకటి కార్తీక్, మహీపతి రామలింగం, వై. వెంకటేశ్వరరావు, సాదం రామకృష్ణారావు, పెండ్యాల శ్రీనివాస్, నరిగె సుజాత, పెండ్యాల రోజాలక్ష్మి, గంధం నరసింహారావు, శ్వేత ప్రకాష్, నాంపల్లి వేణు, బ్యాంక్ ఆచార్యులు బృందం, సందు ప్రభాకర్, పైడిపల్లి మహేష్, పలువురు వర్తకసంఘం సభ్యులు, వాసవిక్లబ్ సభ్యులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన

**బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 02 ( తొలివార్త ):** పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఒకప్పుడు ఎన్నో ఆందోళనలు.. అప్పులు, ఆర్థిక ఇబ్బందులు వెంటాడేవి. అలాంటి కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు అందించి ఆర్థిక భరోసా కల్పించి, వివాహం జరిగిన ఇంట్లో ఆడబిడ్డలకు మేనమామ అయ్యిండు... కుటుంబాలకు పెద్దదిక్కుగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, కొనియాడారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టి, 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, వారు హర్షం వ్యక్తం చేస్తూ, పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల ముఖములో చిరునవ్వు, ఆనందాన్ని నింపిన కేసీఆర్‌కు కృతజ్ఞతగా అశ్వాపురం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో,మాజీ సీఎం కెసిఆర్, ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.."పేదింట్లో ఆడబిడ్డ పుట్టడం ఒకప్పుడు తల్లిదండ్రులకు ఆనందంతో పాటు పెళ్లి ఖర్చులపై ఆందోళన కలిగించేది. ఆ ఆందోళనను అర్థం చేసుకుని ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం అండగా నిలవాలనే ఆలోచనతో,కేసీఆర్,కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసుకొచ్చారు. ఈ పథకాలతో ఎన్నో పేద కుటుంబాలకు పెళ్లి సమయంలో ఆర్థిక భరోసా లభించింది" అని అన్నారు. "ఆడబిడ్డ పెళ్లి కోసం తల్లిదండ్రులు అప్పుల పాలుకాకూడదనే ఆలోచన.. పేదింటి ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వు చూడాలనే సంకల్పం.. ఈ పథకాల వెనుక ఉన్న మానవీయతకు నిదర్శనం" అని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, భాగవతపు సతీష్, ఎస్కే నజీర్ మంద రాంబాబు, నరేష్, కృష్ణతేజ, భరత్ నాయక్, వెంకటేష్, సుదర్శన్, గోపయ్య, రవి, రాకేష్, వీరభద్రం తదితరులు, పాల్గొన్నారు

### వీజీ పిపి ప్రత్యేక గ్రామ సభలో

## పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 02 ( తొలివార్త ):** భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ -- 2026 మరియు వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ వి జి పి పి ప్రత్యేక గ్రామ సభలో భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ఉపసర్పంచ్ రత్నం కవిత వార్డు సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు. లిఈ సందర్భంగా ముందుగా మహాత్మా గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి,ఘనంగా,నివాళులర్పించారు. "స్వచ్ఛతా హి సేవ -- 2026" కార్యక్రమం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు "సమష్టి కృషి -- స్వచ్ఛతపై మనదే బాధ్యత" అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛ భారత్ -- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ... భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. భద్రాచలం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకమైన ప్రాంతమని, పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో భద్రాచలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ భద్రాచలాన్ని పచ్చదనంతో, సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మగాంధీ,జయంతి వేడుకలలో

## పాల్గొని ఘన నివాళులర్పించిన

**మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 02 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణ కేంద్రంలోని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం పుల్లయ్య ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు ,వేసి,ఘనంగా, నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, సంగం పుల్లయ్య మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. దేశ సేవలో లాల్ బహదూర్ శాస్త్రి అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆయన ఇచ్చిన జై జవాన్.. జై కిసాన్" నినాదం నేటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ, శాస్త్రిజీ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ సోషల్ వర్కర్ లతీఫ్.



**వైరా అక్టోబర్ 02 ( తొలివార్త ):** సిరిపురం కేజీ గ్రామంలో సోషల్ వర్కర్లకు గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్నారు. విప్పల మడక గ్రామానికి చెందిన అక్కిసెట్టి ఉమా అనే గర్భిణీ స్త్రీని టెస్టుల నిమిత్తం వైరా ప్రవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి టెస్టులు అనంతరం మరల గర్భిణీ స్త్రీని వారి ఇంటి వద్ద దింపడం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ లతీఫ్ మాట్లాడుతూ సమాజంలో సమాజానికి ఎంతో కొంత సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో ఈ యొక్క గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహించడం జరుగుతా ఉందని తెలియజేశారు. సోషల్ వర్కర్లకి సిరిపురం కేజీ గ్రామం ఫోన్ నెంబర్ 9603747878 కి ఫోన్ చేయగలరని తెలియజేశారు.

### రామచంద్రపురం గ్రామసభ లో

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో ముత్యాలరావు**




**అశ్వాపురం అక్టోబర్ 02 ( తొలివార్త ):** రామచంద్రాపురం గ్రామపంచా యతీలో జరిగిన గ్రామసభ సమావేశంలో ముందుగా ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు, నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన, స్థానిక సర్పంచ్ భూ రెడ్డి స్వాతి, మరియు మండల ఎంపీడీవో ముత్యాలరావు,ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై సర్పంచ్ బూరెడ్డి స్వాతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై ప్రజా సమస్యలపై చర్చించడం జరిగింది. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడం, నీటి సంరక్షణ మరియు నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చించారు. అంగన్వాడి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు:అంగన్వాడి పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అలాగే పోషణ మాసం సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహారం యొక్క ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం జరిగింది. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్యమైన పోషకాహారం ఎంతో అవసరమని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారి ఏఈ, మరియు గ్రామ సెక్రెటరీ వార్డ్ సభ్యులు పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ద

### గాంధీ జయంతి సందర్భంగా

## మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిన

**కృష్ణ సాగర్ సర్పంచ్ తాటి వాణి**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 02 ( తొలివార్త ):** కృష్ణ సాగర్ లో గాంధీ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, స్వచ్ఛత మార్గాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గ్రామంలో స్వచ్ఛత, ప్రజా ఆరోగ్యం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డి ఈ శ్రీనివాస్, ఏఈ వసంత, పంచాయతీ సెక్రటరీ ఎం. నాగిరెడ్డి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

## వృద్ధులు వికలాంగులు వితంతువులకు చీరల పంపిణీ.

**పంపిణీ చేసిన కందిబండ శైలజ రాణి.**

**కంది బండ బాల మురళీకృష్ణ జ్ఞాపకార్థం.**



**వైరా అక్టోబర్ 02 ( తొలివార్త ):** సిరిపురం కేజీ గ్రామంలో కీర్తిశేషులు కందిబండ బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం వారి సతీమణి శైలజారాణి కుమారులు రాజేష్ రాకేష్ సహకారంతో వందమంది వద్ద మహిళలకు వికాంగులకు వితంతువులకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శైలజ రాని మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయటం ఎంతో సంతోషంగా ఉందని, పేద బడుగు బలహీన వర్గాల వారి కోసం సహాయ సహకారాలు అందిస్తామని, మానవసేవే మాధవసేవ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న సన్నంగా మాకు ఉన్నదాంట్లో పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి గుడి పూజారి కొదమసింహం శ్రీమన్నారాయణ ఆచార్యులు సోషల్ వర్కర్లకి ఉప్పలయ్య నారపోగు కృష్ణార్జున నాగలక్ష్మి రిక్కినమ్మ దుప్పటి కృష్ణ సులోచన ఆవుల నాగబాబు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలి.

**సిపిఎం పార్టీ నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు.**



**కొణిజర్ల అక్టోబర్ 02 ( తొలివార్త ):** తనికెళ్ల గ్రామంలో గ్రామ సభ గ్రామ సర్పంచి గడల కళావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో, ఉపాధి హామీ ఎపిఓ గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉప సర్పంచ్ చల్లా నరసింహారావు వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఏ పీ ఓ సర్పంచితో ఉపాధి హామీ పని గురించి మాట్లాడారు. సిపిఎం పార్టీ మండల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపీడీవో కి వినతిపత్రం సమర్పించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామాలను ఉపాధి పథకం పేరును ఇటీవల కేంద్ర ప్రభుత్వం జరిగిందని ఈ పేరును తీసివేస్తూ యధావిధిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరును కొనసాగించాలని పనులు కరువైన నేపథ్యంలో ఉపాధి కూలీలకు రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని, అదేవిధంగా కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలని ఉపాధి హామీ పని వద్ద మెడికల్ కిట్లు టెంట్లు త్రాగునీరు ఇతర సదుపాయాల అన్నీ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని అడిగిన వారందరికీ పని కల్పించాలని కోరుతూ సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి యాస వెంకటేశ్వర్లు రైతు సంఘం నాయకులు తదితరులు ఎంపీడీవో కి వినతిపత్రం సమర్పించారు.

## జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా నిలబడుతుంది....

**జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 02 ( తొలివార్త ):** జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జర్నలిస్టు లు నిర్వహించిన ధర్నా...ఈ కార్యక్రమానికి జర్నలిస్టుల యూనియన్ జేఏసీ ఆహ్వానం మేరకు డిసిసి అధ్యక్షుల తోట దేవి ప్రసన్న మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ పేద జర్నలిస్టుల కుటుంబాలకు ఇంటి స్థలాలు,మరియు ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు,ఇన్సూరెన్స్ తదితర సమస్యలన్నిటిని ప్రజా ప్రభుత్వ దృష్టికి మరియు రాష్ట్ర గృహ నిర్మాణ రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి జర్నలిస్టులకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మంద హనుమంతు,జనరల్ సెక్రెటరీ ఎం.పెద్దబాబు, నాయకులు వై వెంకటేశ్వరరావు కొండా వెంకన్న తదితరులు మద్దతు తెలిపారు.

## నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు
## చేయూత ట్రస్ట్ చైర్మన్ పరిస పుల్లయ్య.



**ఖమ్మం అక్టోబర్ 02 ( తొలివార్త ):** ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు అందరూ సహకరించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్జీపిఏటి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిస పుల్లయ్య కోరారు. మహాత్మా గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కృషి భవన్లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం నగరానికి చెందిన బి పి ఈ డి చదువుతున్న విద్యార్థి రామడుగు నరేంద్రకు 20వేల రూపాయలు చెక్కు జ్ఞాపికలు సీనియర్ పెన్షనర్ రామానుజ స్వామి ట్రస్ట్ సభ్యులు పరిష లక్ష్మీరాజ్యంతో కలిసి ట్రస్ట్ చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి పి ఏ టి జిల్లా నాయకులు రాయల రవికుమార్ గుర్రాల శ్రీనివాసరావు కనపర్తి వెంకటేశ్వర్లు కొలికొండ శరత్ బాబు ఉడుగు వెంకటేశ్వర్లు కనపర్తి నాగ ప్రసాదు వీరభద్రరావు ఎండి రహీముద్దీన్ బి శివకుమార్ దేవా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ,
## లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు

**భారతమాత ముద్దుబిడ్డల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**



**చౌటుప్పల్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** భారత స్వాతంత్ర సమరయోధులు జాతిపిత మహాత్మాగాంధీ మరియు మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి వేడుకలు చౌటుప్పల్ లోని రాజీవ్ స్మారక భవనంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ ఖయ్యూం,చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్,చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,రాజీవ్ స్మారక ఆర్గనైజర్ సెక్రెటరీ నల్ల నరసింహ,జిల్లా కాంగ్రెస్ నాయకులు నందగిరి భీమయ్య,శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ ధర్మకర్త ఆవుల యేసు యాదవ్,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్,మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డి,ఐఎన్టియుసి బ్లాక్ అధ్యక్షులు కంచర్ల జంగయ్య,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదాని గోపాల్,ఐఎన్టియుసి చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా,నాయకులు సుర్కంటి భగవంత రెడ్డి,ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో నకిలీ విలేకరులపై అప్రమత్తంగా ఉండాలి

**బిమీడియా పేరుతో బెదిరింపులు,**

**అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు**



**జవహర్‌నగర్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** జర్నలిజం విలువలు, నైతికతలపై అవగాహన లేకుండా మీడియా పేరును అడ్డుపెట్టుకుని ప్రజలను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్‌నగర్‌కు చెందిన స్థానిక జర్నలిస్టులు సూచించారు. నకిలీ ఐడీ కార్డులు చూపిస్తూ కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రభుత్వం, అధికారులను స్పందింపజేస్తున్న స్థానిక జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా బయట ప్రాంతాల నుంచి వచ్చే కొందరు వ్యక్తులు మీడియా పేరును దుర్వినియోగం చేస్తున్నారని స్థానిక విలేకరులు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం పేరుతో అక్రమాలకు పాల్పడటం వల్ల నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ సీఐ సైదులు దృష్టికి తీసుకెళ్లి, సమస్య తీవ్రతను వివరించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా మీడియా ప్రతినిధులమని చెప్పుకుంటే వారు ఏ పత్రిక లేదా ఛానల్‌లో పనిచేస్తున్నారో నిర్ధారించుకోవాలని, అవసరమైతే సంబంధిత ఎడిటర్, బ్యూరో చీఫ్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ మీడియా పేరుతో ఎవరైనా బెదిరింపులకు లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. స్థానిక జర్నలిస్టులు మాట్లాడుతూ ఇకపై ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. మీడియా పేరుతో ప్రజలను బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

# టీఎస్ యుటిఎఫ్ సత్తుపల్లి మండల 13వ మహాసభ.

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్.**

**మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసిన షేక్ రంజాన్.**





**ఖమ్మం అక్టోబర్ 02 ( తొలివార్త ):** టీఎస్ యుటిఎఫ్ సత్తెపల్లి మండల 13వ మహాసభ సతుపల్లి ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ హాజరయ్యారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సభలో సత్తుపల్లి పెనుబల్లి వేంసూరు దమ్మపేట అశ్వరావుపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ మహాసభను ఉద్దేశించి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలని ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టాలని సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎలక్షన్ అధికారిగా వేంసూరు మండల బాధ్యులు ఈశ్వర చారి వ్యవహరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులుగా హెచ్ సూరయ్య ప్రధాన కార్యదర్శిగా కే అశోక్ చక్రవర్తి ఉపాధ్యక్షులుగా ఐ నాగేశ్వరరావు టి పుష్ప శిరీష ట్రెజరర్ ఎం మధుసూదన్ రావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సిహెచ్ నిరంజన్ కె వెంకటేష్ శశికుమార్ ఏ అనసూయ ఎం కళ్యాణ్ కుమార్ ఏ సాంబశివరావు పి నాగరాజు చింత శ్రీనివాసరావు ఆడిటర్ గా శేఖర్ ఏకే గ్రవ0లో ఎన్నుకున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా లక్ష్మీకాంతమ్మ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులుగా జే మురళీమోహన్ డి భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి జిల్లా కార్యదర్శి పివి రామారావు భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఆర్ రమేష్ కుమార్ ఎం రాజేశ్వరరావు మాజీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి 11 నెలల బాలుడి మృతి



**గుర్రంపోడు అక్టోబర్ 02 ( తొలివార్త ):** గుర్రంపోడు మండలంలోని కొనాయిగూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓర్సు శ్రీను--మమత దంపతుల 11 నెలల కుమారుడు ఓర్సు స్టాలిన్ ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈరోజు ఉదయం తల్లి మమతతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి నిద్రలేచి పాకుతూ ఇంటి ముందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై మృతుడి తల్లి మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అల్లంపురంలో గ్రామసభ

**మహాత్మా గాంధీ 157వ జయంతి ఉత్సవం**

**విబిజి రామ్ జి ప్రణాళికలో 125 రోజుల పని కల్పన**

**నీటి కుంటలు,ఫామ్ పాండ్స్ తదితర నిర్మాణాలపై రైతులకు సమగ్ర అవగాహన**

**సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి**



**చౌటుప్పల్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ టేకుల మంజులా-దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి,నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి వికసిత్ గ్రామీణ భారత్ కార్యక్రమంలో భాగంగా విబిజి రామ్ జి ప్రణాళికలో భాగంగా 125 రోజులు పని కల్పించడం కోసం ప్రతిరోజు 60 మందికి పని కల్పించాలిని గ్రామ సభలో తీర్మానించారు. ప్రభుత్వం ఎక్కువగా నీటిని ఒడిసి పట్టాలనే ఉద్దేశంతో నీటి కుంటలు,ఊట కుంటలు,పామ్ పాండ్స్,బోర్ రీఛార్జిలు,ఇంకుడు గుంతలు,రైతులకు పొలాలకు పోవడానికి మట్టిరోడ్లు పోయడం,చెరువులో మేకలు,కోళ్ల,పశువుల షెడ్లు,కుంటలలో మట్టి తీయించడం,చెక్ డ్యాంలు కట్టడం,ఇలా 375 రకాల పనులు చేయించుకోవాలని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో చేయాల్సిన కొన్ని పనులు కూడా గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టేకుల మంజులా-దిలీప్ రెడ్డి,వార్డు సభ్యులు భూతం లింగస్వామి,కార్యదర్శి సురేష్,ఫీల్డ్‌అసిస్టెంట్ స్వర్ణ,ఆశా వర్కర్ దివ్యశ్రీ,గ్రామ పెద్దలు,గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు



**వలిగొండ, అక్టోబర్ 02 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి మృతి వామపక్ష ఉద్యమానికి, సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పులిగిల్ల గ్రామంలో కొమ్మిడి లక్ష్మారెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించిన యానాల దామోదర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమ్మిడి లక్ష్మారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడని పేర్కొన్నారు. సీపీఎం పార్టీలో సీనియర్ నాయకుడిగా, మాజీ సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలు, రైతులు, కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించారని తెలిపారు. వామపక్ష భావజాలానికి కట్టుబడి ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. లక్ష్మారెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, ఎల్లంకి మహేష్, సలిబద్రి రవీందర్, సుద్దాల సాయికుమార్, మండల కౌన్సిల్ సభ్యుడు సొప్పరి వెంకటేశం తదితరులు పాల్గొని కొమ్మిడి లక్ష్మారెడ్డికి నివాళులర్పించారు.

## జటంగి దేవుడు లింగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు..

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి..**




**నూతనకల్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** మండల పరిధిలోని తాళ్ల సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జటంగి దేవుడు లింగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా వారి మృతదేహంపై గ్రామ సర్పంచ్ జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి, మండల పార్టీ నాయకులు పార్టీ జెండాను కప్పి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ లింగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నకిరేకంటి అనసూయ అయోధ్య,ముక్కుడు దేవులపల్లి సర్పంచ్ బయ్య మల్లయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు దరిపెల్లి వీరన్న, జటంగి లింగయ్య, జటంగి గణేష్,మడ్డి లింగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎల్బీ స్టేడియంలో ఘనంగా
## జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు**





**చౌటుప్పల్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాదులోని ఎల్బి స్టేడియంలో జరిగిన జయంతి వేడుకలలో చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పాల్గొని ప్రసంగించారు. అక్టోబర్ 02న మహాత్మా గాంధీ జయంతిని జరుపుకుంటామని 1869 ఆగస్టు02న గుజరాత్ రాష్ట్రంలో జన్మించిన గాంధీజీ సత్యం,అహింస సిద్ధాంతాలతో భారత స్వాతంత్ర పోరాటానికి నాయకత్వం వహించారు.

**గాంధీజీ సిద్ధాంతాలు**

సత్యం,అహింస,శాంతి మార్గాలను ప్రపంచానికి చూపించిన మహానుభావుడు గాంధీజీ అని,ఉప్పు సత్యాగ్రహం,క్విట్ ఇండియా ఉద్యమం లాంటి పోరాటాలతో బ్రిటిష్ పాలన ఎదుర్కొని భారతావనికి శాంతి మార్గంలో స్వాతంత్రం తీసుక రావడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహాత్ముడు చూపిన సత్యం,అహింస,శాంతి మార్గాలను మనమంతా అనుసరించి సమాజంలో సానుకూల మార్పు తీసుకొచ్చే విధంగా ముందుకు సాగాలని కోరుకుంటూ అందరికి గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

## పాల్వాయిలో సీసీ కెమెరాల ప్రారంభం

**నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం: బుసిరెడ్డి పాండురంగారెడ్డి**



**గుర్రంపోడు అక్టోబర్ 02 ( తొలివార్త ):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామపంచాయతీలో గ్రామస్తుల సహకారం, బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్, నాయకులు వెంకటాపురం అచ్చాలు, రంగరాజు వెంకటేశ్వర్లు, మునుకుంట్ల ప్రతాపరెడ్డి , పంతుల కృష్ణయ్య గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం
## పైనుంచి వెళ్లడంతో యువకుని మృతి



**చౌటుప్పల్, అక్టోబర్ 02 ( తొలివార్త ):** గుర్తు తెలియని వాహనం పైనుండి వెళ్లడంతో అక్కడికక్కడే యువకుడు మృతి చెందిన సంఘటన చౌటుప్పల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జి.మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన కుంచె లారెన్స్(26),కులం మాల వృత్తి:ప్రైవేట్ ఉద్యోగి,రెండు నెలల క్రితం హైదరాబాద్ కు జాబ్ నిమిత్తం వచ్చి ఎర్రగడ్డలో హాస్టల్లో ఉంటున్నాడు. అక్టోబర్2 శుక్రవారం నాడు అతనితో పాటు హాస్టల్లో ఉండే శివప్రసాద్ అనే అతను కలిసి ఏపీ 40ఎల్ వి8524 నెంబర్ గల పల్సర్ బైక్ పై హైదరాబాదు నుండి కాకినాడకు వెళ్తుండగా, శివప్రసాద్ బైక్ నడుపుతుండడంతో వెనకాల లారెన్స్ కూర్చొని చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్దకు రాగానే లారెన్స్ నిద్ర వస్తుందని శివప్రసాద్ కి చెప్పగా వారు తిరిగి మరల హైదరాబాద్ కు వెళ్తుండగా మార్గమధ్యలో అందాజా తెల్లవారుజామున 4:45 గంటల సమయంలో మల్కాపురం గ్రామంలోని ఆందోల్ మైసమ్మ గుడి సమీపంలోకి రాగానే లారెన్స్ బైక్ పై నుండి నిద్రపోయి కిందపడగా వారి వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం అతని తల మీద నుండి వెళ్లగా లారెన్స్ తలకు ఇతర శరీర భాగాలకు బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి,చీకోటి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టుల 10 ఈపీసీ ప్యాకేజీలకు ముగింపు పలికిన కేబినెట్

చిన్న కాళేశ్వరం సవరించిన అంచనాలకు ఆమోదముద్ర

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 10 ఈపీసీ నీటిపారుదల ప్రాజెక్టులను నిలిపివేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.1,017 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదించింది. సాగు నీటి ప్రాజెక్టుల 10 ఈపీసీ ప్యాకేజీలకు ముగింపు పలికిన రాష్ట్ర మంత్రివర్గం, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపింది. గట్టు ఎత్తిపోతల, బాచారం హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకొంది. ఇందిరమ్మ వరద కాలువ, ఎస్సారెస్పీ మూడో ప్యాకేజీలో కొన్ని మార్పులకు ఆమోద ముద్ర వేసింది.





### ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు

నీటి పారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై రాష్ట్ర మంత్రివర్గంలో విస్తృత చర్చ జరిగింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునః సమీక్షించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపి వేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్యాకేజీల వారీగా బకాయిలు, కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, విజిలెన్స్ అంశాలను పరిశీలించాలని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని 10 ప్యాకేజీలను పరస్పర అంగీకారంతో ప్రీ క్లోజర్ చేయాలని నిర్ణయించారు. 2006-2007లో కాంగ్రెస్ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈపీసీలో టెండర్లు జరిగాయి. ఈ టెండర్లు జరిగి సుమారు 20 సంవత్సరాలు అవుతుంది. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. 10 సాగునీటి ప్రాజెక్టుల ఒప్పందాలను రద్దు చేసేందుకు మంత్రివర్గంలో చర్చించడం జరిగింది. - పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి

### చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి 2026-27 ధరల ప్రకారం రూ.1,017 కోట్ల అంచనా వ్యయంతో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి నది నుంచి నాలుగున్నర టీఎంసీల నీటిని ఎత్తిపోసి మంథని నియోజకవర్గంలోని 45,000 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 2007లో ఈ పథకానికి రూ.443 కోట్లతో అనుమతి ఇచ్చారు.ఇందిరమ్మ వరద కాలువ, ఎస్సారెస్పీ మూడో ప్యాకేజీలో 9,125 ఎకరాల ఆయకట్టు తొలగింపుతో పాటు అంచనాల్లో తేడా కింద రూ.211 కోట్లు, అదనపు కాలువ నిర్మాణాలు, సీసీ లైనింగ్ పనుల కోసం రూ.40 కోట్లకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నలసోమనాద్రి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.32 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచే పనులను ప్రస్తుత ఏజెన్సీకి అప్పగిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది.

### వాటి కోసం రూ.64 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు

సామర్థ్యాన్ని మూడు టీఎంసీలకు పెంచడంతో అంచనా వ్యయాన్ని రూ.1,781 కోట్లకు సవరించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో 759 ఎకరాలకు సాగు నీటితో పాటు 8 గ్రామాలకు తాగు నీరు సరఫరా చేసే బాచారం హై లెవెల్ కెనాల్, ముక్కిడిగుండం కెనాల్‌కు సంబంధించి రూ.64 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది.

# హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త నేటి నుంచి మెట్రో, ఆర్టీసీ 'కామన్ పాస్'

హైదరాబాద్ మెట్రో,ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త. ఆర్టీసీ బస్సు, మెట్రో రైళ్లలో ప్రయాణానికి కామన్‌పాస్ విధానం నేటి నుంచి అమల్లోకి రానుంది. కామన్‌పాస్ విధానాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం ప్రయాణాలు చేసే వారి కోసం తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి కోసం ప్రత్యేకంగా 'కామన్ పాస్' విధానాన్ని తీసుకువచ్చింది. నేటి నుంచి కామన్ పాస్ సేవలు అధికారికంగా ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రజా భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కామన్‌పాస్ విధానాన్ని ప్రారంభించనున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రోజువారీ సహా నెలవారీ పాస్‌లను అధికారులు ఖరారు చేశారు.

### రోజుకు నాలుగున్నర లక్షల మంది ప్రయాణాలు

హైదరాబాద్ మహా నగరంలో రోజూ లక్షలాది ప్రజలు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బస్సులు, మెట్రో రైళ్లలో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సుల్లో రోజూ సుమారు 25 లక్షల మంది, మెట్రో రైల్ మూడు కారిడార్లలో రోజుకు సుమారు నాలుగున్నర లక్షల మంది ప్రయాణాలు చేస్తున్నారు. వారంతా బస్సులు, మెట్రో రైలుకు రెండు వేర్వేరు టిక్కెట్లు లేదా పాస్‌లతో ప్రయాణాలు చేస్తున్నారు.దీంతో ప్రయాణికులపై ఆర్థిక భారం పడటం సహా సమయం వృథా అవుతోంది. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం నగరంలోని బస్సులు, మెట్రో రైళ్లకు వేర్వేరు పాస్‌లు కాకుండా ఒకే పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ 'కామన్ పాస్' విధానం నేటి నుంచి అందుబాటులోకి రానుంది. ప్రజాభవన్‌లో జరిగే కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కామన్ పాస్ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.



### ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీలో ప్రయాణం

నిన్నటి వరకు ఆర్టీసీ బస్సు, మెట్రో రైల్ రెండింటిలో ప్రయాణించాలంటే రెండు వేర్వేరు టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి వచ్చేది. కానీ ఈ కామన్ పాస్ విధానంతో బస్సులు, మెట్రో రైళ్లలో ఒకే పాస్‌తో ప్రయాణాలు చేయవచ్చు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రోజువారీ, సహా నెలవారీ పాస్‌లను మెట్రో, ఆర్టీసీ యాజమాన్యం ఖరారు చేసింది.రోజువారీ పాస్‌లో మెట్రో ఛార్జీ రూ.300లు, ఆర్టీసీ ఛార్జీ రూ.100 మొత్తం కలిపి రూ.400లుగా నిర్ణయించారు. నెలవారీ పాస్‌లో మెట్రో ఛార్జీ రూ.7 వేలు, ఆర్టీసీ ఛార్జీ రూ.1,500లు మొత్తం కలిపి రూ.8,500లుగా నిర్ణయించారు. మొదటిసారి కార్డు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణికుల నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తారు. కార్డు తిరిగి ఇచ్చినప్పుడు ఆ రూ.100 తిరిగి వాపస్ చేస్తారు.

### బస్ టెర్మినల్స్, మెట్రో స్టేషన్లలో లభ్యం

ఈ ప్రత్యేక కాంబో పాస్‌లు, డిజిటల్ టికెట్ల సేవలు అధికారిక టీజీఎస్ ఆర్టీసీ మొబైల్ యాప్ ద్వారా పొందవచ్చు. హైదరాబాద్‌లోని బస్ టెర్మినల్స్, ప్రధాన మెట్రో స్టేషన్లలోనూ కామన్ పాస్‌లు అందుబాటులో ఉంటాయి. 'మీ టిక్కెట్' యాప్ ద్వారా మొబైల్‌లోనే టిక్కెట్టు లేదా పాస్ తీసుకుని ఆర్టీసీ సహా మెట్రో రైళ్లలో అపరిమితంగా ప్రయాణించవచ్చు.

# ఉద్యోగులకు 2 డీఏలు, కరవు మండలాల ప్రకటన సహా కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు మంజూరుకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరవు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు దిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను మంజూరు చేసింది.

### 17 శాతం లోటు వర్షపాతం నమోదు

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుమారు 4 గంటల పాటు కేబినెట్ సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. కరవు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు.

### పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండు మంజూరు

కరవు మండలాలు ప్రకటించడంతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి కేబినెట్ విజ్ఞప్తి చేసింది. త్వరలోనే మంత్రుల బృందం దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండు మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.బకాయిలను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరుకు నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు."2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏలలో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవి గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏలు. దీనివల్ల రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.2,500 కోట్ల అదనపు భారం అవుతుంది. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగానే ఉంది. ఈ విషయంలో కేంద్రం తెలంగాణను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కేబినేట్ భేటీలో నిర్ణయించాం" - పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి





### 7,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా

ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్ డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది.ఇందులో 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4 వేల మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు టెండర్లు పిలిచి ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది.

### డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునస్సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే వాటిని రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీకి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి అమలు చేయాలని నిర్ణయించింది.

### 22ఏ భూములపై చర్చ

దిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుంది. ఇటీవల గందరగోళంగా మారిన 22ఏ భూములపై చర్చించిన క్యాబినెట్ మరింత ఊరటనిచ్చేలా వచ్చే మంత్రివర్గంలో నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయపడింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్, 118, 76 జీవోల ప్రకారం కొత్తగా దరఖాస్తు స్వీకరించే అంశంపై తదుపరి క్యాబినెట్‌లో చర్చించాలని నిర్ణయించారు. 22ఏ అంశంపై ఇప్పటివరకు కొన్ని జీవోలు, మెమోలు జారీ చేశాం. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, జిల్లా కేంద్రాలకు సంబంధించిన సంస్థల్లో లేఅవుట్‌లకు, బిల్డింగులకు అనుమతులిచ్చేలా నిర్ణయం తీసుకున్నాం. ఇంకా పెండింగ్‌లో ఉంటే తర్వాత కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం. - పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి

### వరల్డ్ క్లాస్ ఫ్రూట్ మార్కెట్‌కు రూ.650 కోట్లు మంజూరు

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు కోసం రూ.650 కోట్లు మంజూరు చేసిన క్యాబినెట్ పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేసింది.

# వివేకా హత్య కేసులో కీలక పరిణామం వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డికి ఈడీ నోటీసులు

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది.మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు ఇచ్చింది. ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. ఈ కేసులో రూ.40కోట్ల డీల్ జరిగిందనే అంశంపై ఈడీ దర్యాప్తు నిర్వహిస్తోంది. మరో రూ.4 కోట్లు నగదు బదిలీ జరిగిందన్న ఆరోపణలపై అధికారుల ఆరా తీస్తున్నారు.ఈ క్రమంలో ఇప్పటికే నలుగురు నిందితులను విచారించింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు నిందితులు ఎర్రగంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిని విచారించి పలు అంశాలపై ప్రశ్నించింది. ఈ క్రమంలో తాజాగా అవినాష్‌రెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది. సీబీఐ ఎఫ్ఐఆర్, అనంతరం దాఖలు చేసిన ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. 2025 ఆగస్టులో పీఎంఎల్ఏ కింద ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు.వివేకా హత్య కోసం కీలక కుట్రదారులు వెచ్చించాలని నిర్ణయించుకున్న రూ.40 కోట్లు వారు ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనుకున్నారు అంత భారీ మొత్తం వారికి ఇచ్చేందుకు తెర వెనుక సిద్ధమైన వ్యక్తులెవరు హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు నిందితులకు అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.4 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణాల్లో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. 2019 నుంచి నిందితుల బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలికలను ఈడీ పరిశీలిస్తోంది. అలాగే ఆర్థికకోణం, మనీలాండరింగ్‌కు సంబంధించిన నిధుల మార్గంపై ఈడీ దృష్టిపెట్టింది. ఈ క్రమంలో ఆగస్టు 21న హైదరాబాద్, కడప జిల్లాల్లో 6 ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది.కేసులో కీలక కుట్రదారులు, నిందితులు, అనుమానితులు, తెరవెనక సూత్రధారులు వివేకా హత్యకు కొన్ని నెలల ముందు, తర్వాత నిర్వహించిన ఆర్థిక లావాదేవీల్ని నిశితంగా పరిశీలిస్తోంది. ఈ డబ్బు ఎవరి నుంచి ఎవరికి, ఏయే మార్గాల్లో రూటింగ్ అయ్యింది, దీనికి మూలం ఎక్కడుందనే కోణంలో వివరాలు సేకరిస్తోంది. అందులో భాంగగా నిందితులైన అవినాష్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి, సునీల్‌యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిల నివాసాల్లో సోదాలు చేసి కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకుంది.వివేకా హత్య కేసులో ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి పెట్టింది. ఇప్పటికే నిందితుల ఇళ్లలో ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. అందులో భాగంగా ఎంపీ అవినాశ్‌రెడ్డి నివాసాల్లో లెక్కల్లో చూపని 24 లక్షల రూపాయలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలు, కీలక దస్త్రాలను తీసుకెళ్లారు.



# రాష్ట్రంలో 3డీ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు బుర్రిపాలెంలో పైలట్ ప్రాజెక్ట్



ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 పథకం కింద దేశంలోనే తొలిసారి నిర్మించనున్న 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5.10 లక్షలుగా అధికారులు ఖరారు చేశారు. సొంత ఇల్లు కట్టుకోవడం ప్రతీ ఒక్కరి కల. కానీ ఈ రోజుల్లో ఇల్లు కట్టాలంటే విపరీతమైన ఖర్చు అవుతుంది. పేదవారి సొంతింటి కల నెరవేరడం కత్తిమీద సామైంది. ఇలాంటి పరిస్థితుల్లోనే పీఎం ఆవాస్ యోజన ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. ఈ పథకం కింద సాధారణ ఇళ్లను త్రీడీలో నిర్మించనున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 పథకం కింద దేశంలోనే తొలిసారి నిర్మించనున్న 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5.10 లక్షలుగా అధికారులు ఖరారు చేశారు.ప్రస్తుతం ఈ పథకం కింద కట్టే మామూలు ఇళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.2.39 లక్షలు ఇస్తున్నాయి. నూతన సాంకేతికతను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఇళ్లకు అదనపు సాయాన్ని అందించనున్నాయి. ఈ వ్యయంతో ఇంటి స్థలం అభివృద్ధి, నిర్మాణం, మెట్లు, మరుగుదొడ్డి, ర్యాంప్, షేడ్, తదితరాలన్నీ కల్పిస్తారు. రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సాంకేతికంగా సహకరిస్తుంది.బుర్రిపాలెంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా: 3డీ కాంక్రీట్ ప్రింటింగ్‌తో ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్రంలో చేపట్టేలా సీబీఆర్ఐ, కేంద్ర ప్రభుత్వం ముందుకురావడంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకున్నారు. ప్రయోగాత్మకంగా రూర్కీలోని సీబీఆర్ఐలో నిర్మించిన కొన్ని 3డీ ఇళ్లను ఆయన పరిశీలించారు. దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ముందు తన స్వగ్రామమైన తెనాలి నియోజకవర్గ పరిధిలోని బుర్రిపాలెంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయపరచడంతో ఈ నెల 4న అవగాహన ఒప్పందం జరగనుంది.బుర్రిపాలెంలో 100 ఇళ్లను 3డీ విధానంలో నిర్మించనుండగా వీటికి అదనంగా గుంటూరు గ్రామీణ పరిధిలోని ఓబుల్‌నాయుడుపాలెంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా 77 గృహాలను నిర్మించి ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.13.93 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.9.44 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4.49 కోట్లు వెచ్చించనుంది.

# ఓటర్ల జాబితా సవరణ: నోటీసులు వచ్చినా ఆఫీసులకు రావొద్దు: ఏపీ సీఈవో

### ఓటర్లు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేదన్న సీఈవో

### ఇంటి వద్దకే వచ్చి పత్రాలు సేకరించనున్న బీఎల్‌వోలు

### నిరాశ్రయులు, కార్మికుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

### జాబితాలో పేరు లేనివారు తర్వాత కూడా నమోదు చేసుకోవచ్చన్న వివేక్ యాదవ్





ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్-2026)లో భాగంగా నోటీసులు అందుకున్నవారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్వో) కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్‌యాదవ్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) స్వయంగా ఓటర్ల ఇళ్లకు వచ్చి అవసరమైన పత్రాలను సేకరిస్తారని ఆయన తెలిపారు.గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో డిల్లీరావు కూడా పాల్గొన్నారు. ఓటర్ల నుంచి పత్రాలు తీసుకున్న తర్వాత బీఎల్‌వోలే వాటిని ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారని వివేక్ యాదవ్ వివరించారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఆన్‌లైన్‌లో విచారణ ఉంటుందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అలాంటి కేసులు కేవలం 209 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ఒకవేళ విచారణకు హాజరుకావాల్సి వస్తే, నోటీసులు అందుకున్న ఓటరు తన తరఫున 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యుడిని పంపవచ్చని సూచించారు. ఆన్‌లైన్ విచారణ సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. నగరాల్లోని నైట్‌షెల్టర్లలో నివసించేవారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల ఓటు నమోదు కోసం అవసరాన్ని బట్టి ప్రత్యేక హెల్ప్‌డెస్కులు, శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు.'సర్' ప్రక్రియ కోసం ఫాం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు. అయితే సాధారణ సమయాల్లో మాత్రం 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోరల్ రూల్స్-1960' ప్రకారమే ఫాం-6లను వినియోగించాలని స్పష్టం చేశారు. 'సర్' ప్రక్రియలో లేదా తర్వాత జాబితాలో పేర్లు నమోదు చేసుకోలేకపోయిన యువత, మొదటిసారి ఓటు వేసేవారు 'కంటిన్యూయస్ అప్‌డేషన్' ప్రక్రియలో ఈఆర్వోకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# శీతాకాలంపై ఎల్‌నినో ప్రభావం.. అక్టోబర్‌లో ఎండలే!

### ఎల్‌నినో ప్రభావంతో ఈసారి శీతాకాలంలో చలి తక్కువ

### అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు

### తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదు

### ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రపంచ వాతావరణ సంస్థ

### వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం



ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది శీతాకాలంలో చలి తీవ్రత తక్కువగా ఉండనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. వర్షాకాలం ముగిసి, అక్టోబర్ 1 నుంచి దేశంలో శీతాకాలం అధికారికంగా ప్రారంభమైందని తెలిపింది. అయితే, అక్టోబర్ నెలలో మాత్రం చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.దేశవ్యాప్తంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండీ పేర్కొంది. అయితే, వాయవ్య భారతంతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

### తెలంగాణలో వర్షపాతం లోటు

ఇటీవల ముగిసిన వర్షాకాలంలో తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ముఖ్యంగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అత్యధిక లోటు కనిపించిందని వాతావరణ శాఖ వెల్లడించింది. తాజా అంచనాల నేపథ్యంలో రాష్ట్రంలో రాబోయే రోజుల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో మరింత బలపడుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా హెచ్చరించింది. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్యం, ఇంధన రంగాల్లో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సాలో సూచించారు. కాగా, దేశంలో 2026 నైరుతి రుతుపవనాలు 12.6 నుంచి 13 శాతం లోటుతో ముగిశాయి. 2001 తర్వాత ఇంత తక్కువ వర్షపాతం నమోదు కావడం ఇది నాలుగోసారి.



# టాలీవుడ్ మూవీ కుకూన్స్.. పోస్టర్ రిలీజ్

జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన దుగ్గు, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మనగోటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "కుకూన్స్". ఈ చిత్రాన్ని న్యూ వేవ్ పిక్చర్స్, ఎం ఆర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుకేశ్ పొట్ల, మమత రెడ్డి కాసం, మహేశ్ గౌరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు మహేశ్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు . ఈ మూవీని యూత్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ..'కుకూన్స్ సినిమా పోస్టర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ కొత్తగా ఆకట్టుకుంది. డైరెక్టర్ మహేశ్ గౌరి సరికొత్త ఆలోచనలు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. టైటిల్ కూడా చాలా బాగుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ చేసిన వికాస్ గతంలో డ్రామా జూనియర్స్ ప్రోగ్రాంకు మెంటార్‌గా పనిచేశారు. ఇప్పుడీ చిత్రంతో నటుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జగన్, సాగర్, వికాస్‌తో పాటు మిగతా టీమ్ అందరికీ నా బెస్ట్ విషెస్' తెలిపారు. ఈ సినిమాకు బీఎన్ ఆదిత్య సంగీతమందిస్తున్నారు.

# రవితేజ-వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రానున్న చిత్రం.. ఆ టైటిల్ ఫిక్స్ చేశారంటూ ప్రచారం!



మాస్ మహారాజ రవితేజ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఆయన నటించిన 'ఇరుముడి' సినిమాతో భారీ విజయాన్ని అందుకోవడంతో మరోసారి ఫుల్ ఫామ్‌లోకి వచ్చారు. ఈ విజయంతో రవితేజ తదుపరి సినిమాలపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ముఖ్యంగా ఆయన లైనప్‌లో ఉన్న యువ దర్శకుల సినిమాలపై ఇప్పుడు ఇండస్ట్రీలోనూ చర్చ జరుగుతోంది.రవితేజ చేయబోయే సినిమాల జాబితాలో దర్శకుడు వివేక్ ఆత్రేయ ప్రాజెక్ట్ కూడా ఉన్న విషయం తెలిసిందే. విభిన్నమైన కథలను తనదైన శైలిలో తెరకెక్కించే దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయ.. ఈసారి రవితేజతో ఓ ఆసక్తికరమైన కథను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. రవితేజ-- వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఉండనున్నట్టు సమాచారం. రవితేజ మాస్ ఇమేజ్‌కు, వివేక్ ఆత్రేయ టేకింగ్‌కు భిన్నమైన కథనం తోడైతే సినిమా ఆసక్తికరంగా ఉండొచ్చనే అంచనాలు ఇప్పటికే మొదలయ్యాయి.ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ హారర్ ఎంటర్‌టైనర్‌కు 'తులా భారం' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలించి, ఖరారు చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ టైటిల్‌పై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే దర్శకుడు వివేక్ ఆత్రేయ ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌ను పూర్తి చేసినట్టు సమాచారం. కథ, కథనంపై పూర్తి క్లారిటీతో ఉన్న దర్శకుడు.. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే దసరా సమయానికి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాణ సంస్థ వంటి వివరాలపై ఇంకా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. రవితేజ ఇప్పటివరకు మాస్, యాక్షన్, కామెడీతో పాటు విభిన్నమైన కథల్లోనూ నటించారు. ఇప్పుడు వివేక్ ఆత్రేయతో చేయబోయే సినిమా హారర్ కామెడీ థ్రిల్లర్ కావడం ఆసక్తిని పెంచుతోంది. ఈ జానర్‌లో రవితేజ కామెడీ టైమింగ్, మాస్ ఎనర్జీని దర్శకుడు వివేక్ ఆత్రేయ ఎలా ఉపయోగించుకోబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం 'తులా భారం' అనే టైటిల్‌కు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతోంది.



# ఓటీటీలోకి సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'..

లటాలీవుడ్ ప్రయోగాత్మక నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో సుమంత్, సెకండ్ ఇన్నింగ్స్‌లో విభిన్న కథాంశాలతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి' ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌పై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా థియేటర్లలో డీసెంట్ రన్‌ను పూర్తి చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద పలకరించిన ఈ సినిమా తాజాగా ఓటీటీ రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకుని డిజిటల్ ప్రేక్షకులను పలకరించేందుకు వస్తోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకోగా, రేపు అక్టోబర్ 2వ తేదీ నుంచి ఈ చిత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నట్లు అధికారికంగా కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమాలో సుమంత్ సరసన టాలెంటెడ్ నటి ఐశ్వర్య రాజేష్ కథానాయికగా నటించగా, 'టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ సైతం కీలక పాత్రలో కనిపించి సినిమాపై ఆసక్తిని పెంచారు. బ్రిడ్జ్ ఫిలిమ్స్ మరియు రాజా శ్యామల ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మితమైన ఈ చిత్రం, కేవలం తెలుగులోనే కాకుండా పలు పాన్ ఇండియా భాషల్లో ఏకకాలంలో స్ట్రీమింగ్ కానుంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన ప్రేక్షకులు లేదా ఓటీటీలో కొత్త సినిమాల కోసం ఎదురుచూసే సినీ ప్రియులు రేపటి నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ డివోషనల్ థ్రిల్లర్ అనుభూతిని ఆస్వాదించవచ్చు.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040